# మా మాట

తెలుగు కళా సమితి సభ్యులకు, అతిధులకు, రచయితలకు తెలుగు కళా సమితి రజతోత్సవ శుభాకాంక్షలు. అమెరికాలో మన తెలుగు సంస్కృతి మన పిల్లల ద్వారా చిరకాలం వర్ధిల్లాలి అనే ధ్యేయంతో తెలుగుకళాసమితిని జనవరి ౧౯౮౪లో ప్రారంభించారు దూరాలోచన కల్గిన కొంతమంది పెద్దలు. వీరిలో ముఖ్యులు జొన్నాడ రామకృష్ణ, కిడాంబి రఘునాథ్, కె.వి. రావు, దామా వెంకయ్య, చలికొండ రామకృష్ణ, భండారు రాజారావు. అందరూ కలుసుకొని తెలుగు కళా సమితి గురించి చర్చించడం, జొన్నాడ రామకృష్ణ గారిని మొదటి అధ్యక్షుడుగా ఉండమని కోరడం గుర్తు. జొన్నాడ రామకృష్ణ, కిడాంబి రఘునాథ్ ఇప్పుడు మనతో ఉంటే ఈ రజతోత్సవ సందరంలో ఉప్పొంగి పోయేవారు.

సారస్వత, సాంస్కృతిక, సాంఘిక కార్యక్రమాలు తెలుగు కళా సమితిను వర్ధిస్తాయి. కూచిపూడి-భరత నాట్యాలతో, శాస్త్రీయ-లలిత సంగీతాలతో, నాటకాలతో, మొదటి పదేళ్ళలో ఎంతోమంది 'అన్నపూర్ణలు' ఇంట్లో వండిన (తరువాత 'కేటరింగ్' ద్వారా ) కమ్మని భోజనాలతో ౨౫ సంవత్సరాలు ఇట్టే గడిచిపోయాయి. తెలుగు కళా సమితితో పెరిగిన పిల్లలు పెద్దవాళ్ళైనారు. ఇప్పుడు వాళ్ళ పిల్లలు తెలుగుకళాసమితి కార్యక్రమాలలో పాల్గొంటున్నారు.

జనవరి ౧౯౮౪లో తెలుగు జ్యోతి కిడాంబి రఘునాథ్ సంపాదకీయంతో ప్రారంభమయింది. చేతివ్రాతతో రాసిన రచనలతో ౧౬ పేజీల తెలుగు జ్యోతి వెలువడింది ౨౫ ఏళ్ళ క్రితం. ఇప్పటిదాకా ఈ జ్యోతి నిరాటంకంగా వెలగడానికి కారణం ఎంతోమంది తమ రచనలను మాకు అందజేయడమేకదా! ఈ ౨౫ సంవత్సరాలలో తెలుగు కళా సమితిలో జరిగిన కార్యక్రమాలు, సన్మానాలు, పురోగతి గురించి తెలియాలంటే పాత తెలుగు జ్యోతి పత్రికలు చూడండి.

వ్యవధి తక్కువైనా కోరిన వెంటనే తమ రచనలను పంపిన రచయితలకు మాకృతజ్ఞతలు. ఈ ప్రత్యేక సంచికలో కథలు, వ్యాసాలు, గేయాలతో పాటు తెలుగు కళా సమితి/తెలుగు జ్యోతి చరిత్ర మీద కొన్ని రచనలున్నాయి. మన రెండవ (యువ ) తరం కూడా ముందుచూపుతో తెలుగు కళా సమితి పురోగతి గురించి వారి అభిప్రాయాలను తమ రచనల ద్వార తెలిపేరు. తెలుగు కళా సమితి వంటి సంఘాలను మన పిల్లలకు అప్పగించే ముందు ఈపిల్లల అభిప్రాయాలను అర్థం చేసుకోవడం సంఘ కార్యవర్గాలకు ముఖ్యం. తెలుగు కళా సమితి భవిష్యత్తు కొత్తగా వచ్చే తెలుగు వాళ్ళ మీద ఆధారపడి ఉంటుందా, లేక ఇక్కడ పుట్టిన మన పిల్లల మీద ఆధారపడి ఉంటుందా? ఈప్రశ్నకు జవాబు మనకు ఇంకా తెలియదు.

ఈ రజతోత్సవ ప్రత్యేక సంచికను తయారు చేయడానికి వైదేహి శశిధర్, కాశీనాధుని రాధ, దశిక శ్యామల ఎంతో సహాయం చేశారు. తరచు తెలుగు జ్యోతికి రచనలు పంపే రచయితలను తమ రచనలను పంపమని కోరడం, రచనలు టైపు చేయడం, తప్పులు దిద్దడం వంటి పనులు చేసి ఈ సంచికను తయారుచేశారు. ఉప్పల శైలజ, భారతి భావరాజు, పద్మ అడుసుమిల్లి, శిరీష చిర్రా, లక్ష్మి రాయపూడి, ఊటుకూరి కుమార్, రామకృష్ణ దశిక రచనలు టైపు చేసి సహకరించారు. ఉప్పల అనంత సుధాకర్ కథలు, వ్యాసాలు, గేయాలు, బొమ్మలు కలిపితే ఈ అందమైన పుస్తకం రూపం వచ్చింది. మన తెలుగు జ్యోతికి ఎన్నో ముఖచిత్రాలు వేసిన తురగా చలం ఈ ప్రత్యేక సంచికకు ముఖచిత్రం, కథలకు, గేయాలకు చిత్రాలు వేశారు.

**-- భావరాజు మూర్తి**

## Editorial Committee


Bhavaraju Murthy


Radha Kasinadhuni


Anantha Sudhaker Uppala


Vaidehi Sasidhar


Syamaladevi Dasika